లింక్ ప్రొడక్ట్స్ విధానాన్ని రద్దు చేయాలి: ఎరువుల డీలర్ల డిమాండ్

పరకాల, ఆగస్టు 12(పీసీడబ్ల్యూ న్యూస్):పరకాల మండల ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ & సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గందె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సహాయ వ్యవసాయ సంచాలకులు (ADA) పరకాలకి ఎరువుల వ్యాపారంలో డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు మాట్లాడుతూ, ఎరువుల డీలర్లపై వివిధ కంపెనీలు లింక్ ప్రొడక్ట్స్ పేరుతో అదనపు ఉత్పత్తులను తీసుకోవాల్సిందిగా ఒత్తిడి చేయడం వల్ల డీలర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా యూరియా, ఐఫ్రా వంటి ప్రధాన ఎరువులతో పాటు జింక్, బయో ఫర్టిలైజర్స్ తదితర ఉత్పత్తులను తప్పనిసరిగా లింక్ చేసి విక్రయించే విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని కోరారు.డీలర్లకు అవసరం లేని ఉత్పత్తులను కంపెనీల నుంచి తీసుకోవాల్సి రావడం వల్ల పెట్టుబడి నిలిచిపోవడంతో పాటు, వాటి నిల్వలు పెరిగి ఆర్థికంగా నష్టం వాటిల్లుతోందని తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులను సకాలంలో అందించడమే డీలర్ల ప్రధాన ఉద్దేశమని, కంపెనీల లింక్ విధానం వల్ల డీలర్లు మరియు రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.అలాగే, లింక్ ప్రొడక్ట్స్ విషయంలో కంపెనీల ఒత్తిడిని నియంత్రించి, డీలర్లపై ఎలాంటి బలవంతపు కొనుగోళ్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ADA అవినాష్ వర్మ ని కోరారు.డీలర్ల సమస్యలను వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, తగిన చర్యలు తీసుకునేలా సహకరించాలని అసోసియేషన్ తరఫున విజ్ఞప్తి చేశారు.